


## లంచవతారాలకి బుద్ధి చెప్పే కథ

**ఎ.రాజరాజేశ్వరి**

# మరో మలుపు

దక్షిణామూర్తి రెండు చేతులూ కట్టుకొని మౌనంగా తలొంచుకుని నిలుచున్నాడు. ఆఫీసరు తిట్టే తిట్ల నుండీ ఎటూ తప్పించుకోలేక 'ఇక చాలు మహాప్రభో!' అన్నట్లు దీనంగా చూస్తున్నాడు.

ఫైలు వంకతో లోపలికొచ్చిన అటెండరు అప్పారావు అతడి అవస్థ చూసి ముసిముసిగా నవ్వుకుంటు న్నాడు. 'మొగుడు కొట్టినందుకు కాదు.. తోటికోడలు నవ్వినందుకు' అన్నట్లు ఆఫీసరు శంభులింగం తిట్ల కన్నా, అప్పారావు నవ్వు చూసి కారం రాసుకున్నట్లయింది.

తనింక నోరు విప్పి ఏదో ఒక జవాబు చెప్పకపోతే, సాయంత్రం ఆఫీసు వదిలే వరకూ అలా తిడుతూనే ఉంటాడు.

ఇక తప్పదన్నట్లు మొహాన్ని అతి దీనంగా పెట్టాడు, "ఏదో బుద్ధి గడ్డితిని తప్పు చేశాను. క్షమిం చండి సార్!" అన్నాడు పళ్లబిగువున.

శంభులింగం అతడివైపు తీవ్రంగా చూసి "నువ్వు చేసింది చిన్న తప్పిదమా! నిన్ను క్షమించి వదిలేయడా నికి" అన్నాడు కరుకుగా.

"నేను ఈ ఆఫీసులో చార్జి తీసుకున్న రోజునే చెప్పాను. నేను నిజాయితీ గల ఆఫీసరునని. మీలో ఎవరయినా లంచావతారాలుంటే, ఆ పనికి స్వస్తి చెప్పకపోతే నేను సీరియస్ ఏక్షన్ తీసుకుంటానని, నెల తిరిగేసరికి ప్రభుత్వం నుండీ జీతాలు తీసుకుం టున్నాం. కనీసం ఆ జీతానికి తగ్గ పని కూడా చేయక ఇన్నాళ్లూ ఎంజాయ్ చేస్తూనే ఉన్నారు. అయినా తృప్తి లేదు మీకు. ఆ కాంట్రాక్టరు బిల్లులో లొసుగులున్నా యని తెలిసీ, ఆ బిల్లు పాస్ చేయిస్తానని నా పేరు చెప్పి, అతడి దగ్గర నుండీ పదివేలు లంచం తీసుకోవ డానికి సిగ్గుగా లేదా! దీనికి మీ సమాధానం ఏమిటి? మీరు చేసిన పనికి మెమో ఇస్తాను. తొందరలోనే సస్పె న్షన్‌కి రెడీగా ఉండండి"

శంభులింగం మాటలకు నీళ్లు నములుతున్న దక్షి ణామూర్తి, అమాంతం అతడి కాళ్ల మీద పడ్డాడు.

"అంత పని చేయకండి సార్! పిల్లలు గల వాడిని మా అమ్మాయి పెళ్లి కుదిరింది. అందుకే కొంచెం కక్కుర్తి పడ్డాను. ఈసారికి వదిలేయండి సార్!"

కూతురి పెళ్లని ప్రాధేయపడుతున్న అతడిని చూసి శంభులింగం మనసు కరిగింది.

"కూతురి పెళ్లంటున్నావు. కాబట్టీ... ఈసారికి నిన్ను క్షమించి వదిలేస్తున్నాను. నువ్వు తీసుకున్న లంచం డబ్బు వాళ్లకి వాపసిచ్చేయ్. వెళ్లింక!" అన్నాడు.

బ్రతుకు జీవుడా అనుకుని అక్కడి నుండి బయట పడిన దక్షిణామూర్తికి మనసు కుతకుతలాడుతోంది. తనని ఇంతలా అవమానించిన శంభులింగాన్ని, ఊరికే వదలకూడదనుకున్నాడు కక్షగా.

గడ్డివాము దగ్గర కుక్కలా గడ్డి తను తినదు ఇంకొ కరిని తిననివ్వదు. అప్పనంగా దొరికే గడ్డి రుచికి అల వాటుపడిన వాడు మరి.

తన ఖర్మకాలి బిల్లు పాస్ చేయిస్తానని ఒక కాంట్రాక్టరు దగ్గర పదివేలు లంచం తీసుకున్నాడు. అందులో లొసుగులున్నాయని శంభులింగం రిజెక్టు చేసిన బిల్లది. అయినా ఎలాగోలా మాయచేసి సంతకం పెట్టిద్దామనుకుని, తగిన సమయం కోసం కాచుకున్నాడు.

అయితే ఎంతకీ తన బిల్లు పాస్ కాకపోవడంతో ఒళ్లుమండిన ఆ కాంట్రాక్టరు శంభులింగాన్ని డైరె క్టుగా అప్రోచయ్యాడు.

శంభులింగం నిఖార్సయిన నిజాయితీపరుడు. అతడు ఎక్కడ పనిచేసినా తన వృత్తి ధర్మానికి ఏటు వంటి మచ్చ రానీయక, మిస్టర్ క్లీన్ అనిపించుకు న్నాడు. అతడి నిజాయితీ చాలా మంది లంచావతారా లకు కంటగింపయింది. పై అధికారుల ప్రాపకంతో అతడిని కుదురుగా ఒక చోట ఉండనివ్వక బదిలీ పేరుతో అన్ని ఊర్లు తిప్పుతున్నారు.

ఆ విధంగా ఈ ఆఫీసుకి వచ్చి ఆరు నెలలయింది. ఇతడి గురించి అదివరకే విని ఉండడం వలన స్టాఫ్ ఎవరూ పెద్దగా ఆశ్చర్యపడలేదు. అతడీ ఆఫీసులో పని చేసేంతకాలం లంచాల జోలికి పోకుండా అంతా సైలెంటయిపోవాలని డిసైడయిపోయారు.

అయితే దక్షిణామూర్తికి చిన్నప్పటి నుండీ కూడా కమిషను తీసుకోకుండా ఏ పనీ చేసే అలవాటు లేదు. అది ఎంత ముదిరిందంటే తల్లి కూరలు, పాలు లాంటివి తెమ్మన్నా రూపాయో, రెండో నొక్కేసేవాడు.

అటువంటిది గవర్నమెంటు ఆఫీసులో కాసుల వర్షం కురిపించే సీటు దొరికాక అతడి బుద్ధి, చేతులు విశ్రాంతిగా ఉంటాయా...!

సాగినంత కాలం యధేచ్ఛగా దోచుకుని ఆస్తులు సంపాదించుకున్నారు.

కానీ శంభులింగం వచ్చినప్పటి నుండీ మృష్టాన్న భోజనం తినే మనిషి ఒక్కసారిగా ఉపవాసముండా లంటే కుడితిలో పడ్డ ఎలకలా విలవిల్లాడాడు.

అదుగో... ఆ టైంలోనే పదివేలు దొరికాయను కుంటే, ఆ కంట్రాక్టరు ఓపిక పట్టక ఆఫీసరుకి చెప్పి రసాభాస చేశాడు.

ఆఫీసరు దగ్గర అవమానపడి, తన సీట్లో కూర్చున్న దక్షిణామూర్తిని చూసి అప్పారావు వేళాకో ళాలాడాడు. "ఈ రోజు మన సారుకి ఫుల్లు టిఫిను దొరికిందంటూ ఈ అటెండరు గాడు పుండుమీద కారం చల్లితే, ఆ ఆఫీసరు గాడు నరం మీద పుండులా నలుపుతాడు" అని గొణుక్కుంటూ పనిలో పడ్డాడు.

శంభులింగం క్యాబిన్‌లో నుండీ బయటికొస్తున్న అప్పారావుని చూసి, దక్షిణామూర్తి మంచినీళ్లు కావా లంటూ పిలిచాడు.

అతడు తన చేతిలో ఉన్న బిల్లు, చెక్కు టేబులు మీద పెట్టి నీళ్లకోసమెళ్లాడు. అక్కడ ఏం పెట్టాడా.. అని కుతూహలంగా చూసిన దక్షిణామూర్తి భృకుటి ముడిపడి, పెదవులు వంకర నవ్వుతో విచ్చుకున్నాయి.

నీళ్లు తెచ్చిచ్చిన అప్పారావుని ఏమెరగనట్లుగా అడిగాడు. "ఎక్కడికో. బయటికెళుతున్నట్లున్నావు. ఏంటి సంగతి?" అంటూ.

"శంభులింగం సారు చిన్న పని చెప్పారు. ఇవాళ లాస్టు డేటు. కాస్త కరెంటు బిల్లు కట్టమని ఆటోకి డబ్బిచ్చి మరీ పంపుతున్నారు. ఎంతయినా సార్‌వి. ఎదుటివారి కష్టం, సుఖం తెలిసిన పెద్ద మనసు" అని చెక్కు, బిల్లు తీసుకుని వెళ్లిపోయాడు.

దక్షిణామూర్తికి చెప్పలేనంత సంతోషంగా ఉంది. చేప గాలానికి చిక్కి, దాని ఉనికిని కోల్పోవడానికింక ఎంతో కాలం పట్టదు. తనకి బాగా పరిచయమున్న కాంట్రాక్టర్ నీలకంఠానికి ఫోనుచేశాడు తననొకసారి ఇంటి దగ్గర కలుసుకోమంటూ.

ఇది జరిగిన వారం రోజులకు-

ఇద్దరు వ్యక్తులు ఆఫీసరు శంభులింగం క్యాబిన్ లోకి దూసుకొచ్చారు. తాము ఎ.సి.బి. కార్యాలయం నుండీ వచ్చినట్లుగా పరిచయం చేసుకున్నారు.

శంభులింగం కనులు చిట్లించాడు. తనిక్కడకి వచ్చాకా ఈ ఆఫీసులో లంచం అనే మాట లేకుండా కట్టడి చేశాడు. మరి వీళ్లిప్పుడెందుకొచ్చినట్టు? దక్షిణామూర్తి తీసుకున్న లంచం సంగతి వీళ్ల దృష్టికొచ్చిందా? అని ఆలోచిస్తూ, వారి వైపు నవ్వుతూ చూశాడు.

"మీరు ఇక్కడికి రావడం టైం వేస్టు తప్ప ఫలితం ఉండదు. మీరు ఏదో ఎంక్వైరీకి వచ్చినట్లున్నారు. మీ డ్యూటీ మీరు చేసుకోవచ్చును" అన్నాడు.

శంభులింగాన్ని లేచి పక్కగా నిలుచోమని చెప్పి అతడి టేబుల్‌ని, దాని అరలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పదమైనదేమీ దొరకలేదు.

శంభులింగం మొహంలో విసుగు చోటుచేసుకుంది. ఎంత ఎ.సి.బి. వారయితే మాత్రం ఏ..కారణం లేకుండా దాడి పేరుతో.. తన పనికి అడ్డం పడడం చిరాకు కలిగింది.

"అయిందాండీ! మీ..పరిశోధన! ఇక మీరు అనుమతిస్తే, నా పని నేను చూసుకుంటాను" అన్నాడు సాధ్యమైనంత సౌమ్యంగా.

ఆ మాటలను వినిపించుకోనట్టుగా చూస్తూ "నాలుగు రోజుల క్రితం మీరు కంట్రాక్టరు నీలకంఠం బిల్లు పాస్ చేశారా!" అని అడిగారు.

"నీలకంఠం ఎవరా!" అని ఒక నిముషం తీవ్రంగా ఆలోచించిన శంభులింగానికి సడన్‌గా గుర్తొచ్చింది.

ఆ రోజు తను చాలా బిజీగా ఉన్నాడు. అకస్మాత్తుగా ఒక వ్యక్తి తలుపు తోసుకొని లోపలికొచ్చాడు. మర్యాద లేక అలా లోపలికొచ్చేసిన అతడి వైపు తను కోపంగా చూశాడు. కానీ అదేమీ పట్టించుకోని అతడు "నమస్తే! సార్! నా పేరు నీలకంఠం. నేనొక చిన్న సైజు కంట్రాక్టరుని. టెండరు నిజాయితీగా వేస్తాను. దానికి సంబంధించిన పనులు కూడా అంతే నిజాయితీగా చేస్తాను. పనులు పూర్తి చేసి రెండు నెలలయింది. అప్పటి నుండీ బిల్లు పాస్ చేయించుకునేందుకు మీ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నాను. ఏ కొర్రీలు లేకుండా అంతా సక్రమంగానే ఉన్నప్పటికీ, తమకి పర్సంటే జి ఇస్తే కానీ, ఈ బిల్లు తమరిదాకా రానివ్వమన్నారు. వడ్డీకి అప్పులు చేసి, మరీ పనులు పూర్తి చేశాను. మీరిప్పుడీ బిల్లు పాస్ చేయకపోతే, నాకిక ఆత్మహత్యే శరణ్యం!" అన్నాడు గుడ్లనీరు కక్కుతూ.

తను చేస్తున్న పని పక్కన పెట్టి, అతడు తెచ్చిన కాగితాలు, ఖర్చులు చూసి అందులో మోసం ఏమీ లేదని నిర్ధారించుకున్న అతడు వెంటనే సంతకం చేశాడు. శంభులింగం చేసిన ఉపకారానికి, అతడు ఒంగి దండాలు పెడుతూ వెళ్లిపోయాడు.


ఆ రోజు ఏమి జరిగిందో... పూస గుచ్చినట్లుగా ఎ.సి.బి. వారికి వివరంగా చెప్పాడు శంభులింగం. "సరే... అన్ని విషయాలూ.. చెప్పారు కానీ.. మీరు ఆ బిల్లు పాస్ చేసినందుకు తీసుకున్న నలభై వేల సంగతి చెప్పడం మరచిపోయారు" అన్నారు తాపీగా.

ఆ ఆరోపణకు శంభులింగం నిర్ఘాంతపడి చూశాడు. "సారీ.. సార్! మీకెవరో తప్పుడు సమాచారం ఇచ్చారు. ఉద్యోగంలో చేరిన నుండీ, నేనింత వరకూ జీతం తప్ప ఎవరి దగ్గరా పైసా ఆశించలేదు. నేనిక్కడకి వచ్చాకా, నా స్టాఫ్‌ని కూడా లంచం జోలికి పోకుండా కట్టడిలో పెట్టాను. అటువంటిది నేనెలా లంచం తీసుకుంటాను" అన్నాడు వెలవెలబోతూ.

మీతో బిల్లు పాస్ చేయించుకున్న వ్యక్తి మా వద్దకు వచ్చి, తన బిల్లు పాస్ చేసినందుకు తన దగ్గరనుండీ నలభై వేల రూపాయలు లంచంగా తీసుకున్నట్టు సాక్ష్యంతో సహా నిరూపించాడు. దొరికితే అందరూ దొంగలే... దొరక్కపోతేనే మీలా దొరలు" అన్నారు వ్యంగ్యంగా.

శంభులింగం మొహం కత్తివేటుకు నెత్తురు చుక్క లేనంతగా పాలిపోయి, గొంతు తడారిపోయింది.

"సాక్ష్యమా..! ఏంటది?" అన్నాడు గొంతు పెగల్చుకొని. ఆ ప్రశ్న కోసమే చూస్తున్నట్లుగా, తమ దగ్గ



రున్న కౌంటరు ఫాయిల్ తీసి, అతడి మొహం ముందుంచారు.

“ఈ సాక్ష్యం చాలా! ఇంకేమయినా కావాలా? ఎవరికీ అనుమానం రాకుండా ఉండాలని. మీ అకౌంటు నెంబరు అతడికిచ్చి, అందులో డబ్బు జమ చేయమనడం అబద్ధమా..! ఆ డబ్బు మీ అకౌంటులోకి ఎలా వచ్చిందో.. మీరు చెప్పలేరు. అది లంచం కాబట్టి.. మీ బ్యాంకు అకౌంటు సీజ్ చేయడమే..కాక, మీరు లంచగొండి అని రిపోర్టు మీ పై అధికారికి పంపిస్తున్నాం. సస్పెన్షన్‌కు సిద్ధంగా ఉండండి” అన్నారు.

శంభులింగానికి జరుగుతున్నదంతా బుర్రకెక్కడం ఎప్పుడో మానేసి, చలనం లేనట్టుగా వారి వైపు కళ్లప్పజెప్పి చూడసాగాడు.


ఆఫీసులోని స్టాఫంతా తగిన శాస్తి అయిందంటూ లోలోన సంతోషించినా పైకి మాత్రం సానుభూతిగా చూడసాగారు.

దక్షిణామూర్తికి సంతోషంతో ఉబ్బి, తబ్బిబ్బవుతూ నోట మాట రావడం లేదు. తన పథకం ఇంత త్వరగా ఫలిస్తుందనుకోలేదు. శంభులింగం పీడ వదలిపోతే తన పాత పంథాలో చేతులు అందినంత మేరా చాచి, తర తరాలకూ తరగని ఆస్తులు కూడపెట్టవచ్చును అని మురిసిపోసాగాడు.

ఎ.సి.బి. వారి రాక వారి హెచ్చరికలు అన్నీ గమనిస్తున్న అప్పారావు, శంభులింగం సార్‌ని లంచగొండిలా చిత్రీకరించడం భరించలేకపోయాడు.

బయటికెళ్లిపోతున్న వారి వెంట పడ్డాడు. “సార్...సార్... ఒక్క నిముషం ఆగండం”టూ.. వారిని ఆపి, కొంచెం సైడుకి తీసుకెళ్లాడు మీతో మాట్లాడాలి అంటూ.

“సార్.. ఈ ఆఫీసులో నేను నాలుగేళ్లుగా పనిచేస్తున్నాను. ఎవరెలాంటి వారో నాకు బాగా తెలుసు. మా ఆఫీసు అవినీతిపుట్ట. కంట్రాక్టర్ల బిల్లులు శాంక్షను కావాలంటే, పర్సంటేజీల రూపంలో కమిషన్ తప్పకుండా వసూలు చేస్తారు. వారు అడిగినంతా ఇస్తే బిల్లులు






త్వరగా పాసవుతాయి. లేకుంటే ఏదో ఒక సాకుతో వాటిని నెలల తరబడి నొక్కిపెడతారు. మిగిలినవారంతా చూసీ చూడనట్లు పోయినా దక్షిణామూర్తి సార్ మాత్రం, పేరుకు తగ్గట్టుగా దక్షిణ చేతిలో పడ్డాకనే పనిచేస్తాడు. అతడు కూడబెట్టిన ఆస్తులు ఎక్కడ ఎంతెంతున్నాయో, ఎవరి దగ్గర ఎంత తీసుకున్నాడో నాకు బాగా తెలుసు.

“శంభులింగం సార్ ఇక్కడికొచ్చాకా ఈయన ఆటలు సాగకపోవడంతో ఆయన మీద కోపం పెంచుకున్నాడు. అదీకాక ఒకసారి పదివేలు లంచం తీసుకుని దొరికిపోయాడు. మా సార్ అది తప్పని మందలించారు. సస్పెండు చేస్తానని బెదిరించారు కూడా. పని తొందరలో ఉన్న శంభులింగం సార్ కరెంటు బిల్లు కట్టమని చెక్కు నా చేతికిచ్చారు. నా అజాగ్రత్త వలన అది దక్షిణామూర్తి కంట పడింది. ఈ సంగతి నాకెలా తెలిసిందంటే ఆ సాయంత్రం ఆయన టేబులు సర్దుతుంటే, మా సార్ పేరు, బ్యాంకు పేరు, అకౌంటు నెంబరు ఉన్న కాగితం నాకు దొరికింది. అదక్కడ ఎందుకుందో అర్థంకాక ఎందుకయినా మంచిదని నా పర్సులో జాగ్రత్తగా దాచి పెట్టాను. చూడండి సార్... ఈ పేపరు ఎందుకు రాసి పెట్టుకున్నాడో విచారిస్తే నిజాలు బయటికొస్తాయి” అన్నాడు.

ఎ.సి.బి. ఉద్యోగులు మొహామొహాలు చూసుకొని, అప్పారావుని ప్రశంసిస్తూ అతడి భుజం తట్టారు. ఒక నిరపరాధికి అన్యాయం జరగకుండా నిరోధించినందుకు అభినందించారు.

ఒక వారం తరువాత దక్షిణామూర్తి ఆస్తుల వివరాలు, బినామీ పేరున ఉన్నవీ చూసి వారు నోరెళ్లబెట్టారు. అతడి ఆస్తులన్నిటినీ సీజ్ చేసి, సస్పెండు చేశారు. పోలీసుల సహాయంతో కాంట్రాక్టరు నీలకంఠంకి ‘మర్యాద’ చేయడంతో, శంభులింగం అకౌంటులోకి ఆ డబ్బు చేరడం వెనుక గల కుట్ర బయటపడింది.

గురిచూసి వదలిన బాణం వెనుతిరిగి వచ్చి తనకే గుచ్చుకోవడంతో దక్షిణామూర్తి ఊపిరాడక గింజుకోసాగాడు. కొండ నాలికకు మందెయ్యాలనుకుంటే, ఉన్న నాలుక ఊడిన చందాన అయింది అతడి పని. శంభులింగం జీవితాన్ని మలుపు తిప్పాలనుకుంటే, ఆ దేవుడు తన జీవితాన్ని మరో మలుపు తిప్పాడు. అంతా తన స్వయంకృతం.. అనుకున్నాడు బాధగా.

## అశిన్ ఆశ!

హిందీలో ఒకే ఒక్క చిత్రం ‘గజినీ’తో బాలీవుడ్డంతా ఆకట్టుకున్న అశిన్ తొలిచిత్రంలోనే అమీర్ ఖాన్‌తో నటిస్తే మలిచిత్రంలో సల్మాన్ ఖాన్ హీరో. ఇక ఆమె నటించాల్సి వుంది మరో ఇద్దరు ‘ఖాన్’ల సరసన. షారుఖ్ ఖాన్, సైఫ్ అలీ ఖాన్‌లు. అయితే అశిన్‌కి మాత్రం షారుఖ్‌తో నటించాలని తెగ ఉబలాటంగా వుందిట. ఆ సంగతి ఆమె స్వయంగా చెప్పింది కూడా. నిజమేలెండి- షారుఖ్ సరసన నటించే హీరోయిన్లకి కెరీర్‌లో బాగా కలిసొస్తుందనే సెంటిమెంటు వుంది కదా! అందుకనే కాబోలు అశిన్ ఇలా ఆశపడుతోంది.